క్లుప్తంగా

సీఎం ప్రకటనతో జోష్



మాట్లాడుతున్న వాహబ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాల్లో ఉన్న నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తానని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన కార్యకర్తల్లో జోష్ నింపిందని అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాహబ్ అన్నారు. సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ అభివృద్ధి కోసం పనిచేసే కార్యకర్తలను గుర్తిస్తున్నామని అనడంతో కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమం అజ్మత్, రాశాద్, పవన్, రాజిరెడ్డి, సాయిప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే మేధో సంపత్తి



ధ్రువపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

గజ్వేల్‌రూరల్: పుస్తక పఠనంతోనే మేధో సంపత్తి పెరుగుతుందని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘు, తెలుగు సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ బాలాచారి అన్నారు. బాలుర ఎడ్యుకేషన్ హబ్ లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నేషనల్ బుక్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం 'పుస్తక సమీక్ష' కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా మేథోసంపత్తి పెంపొందడంతో పాటు పుస్తకాల్లో ఉన్నటువంటి విలువైన అంశాలను తెలుసుకునే అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ బుక్ ట్రస్టు తెలుగు సంపాదకుడు డాక్టర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల కోసం పోరాడుతాం



నినాదాలు చేస్తున్న వేదిక నేతలు

సిద్దిపేటకమాన్: ఆదివాసీల హక్కులకై పోరాడుతామని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నేతలు తెలిపారు. వేదిక ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, జార్ఖండ్, మధ్యప్రదేశ్ అటవీ ప్రాంతాల్లో ఉన్న సహజ వనరులు, ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలనే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజనులను హతమారుస్తోందన్నారు. ఆ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నారాయణరావు, చంద్రమౌళి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పంట బీమా అమలు చేయండి



మాట్లాడుతున్న రామలింగారెడ్డి

సిద్దిపేటకమాన్: పంట నష్టం జరిగినపుడు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించే విధంగా పంటల బీమా పథకం అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు రామలింగారెడ్డి డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరి పంటకు దోమపోటు, అగ్గి తెగులు లాంటి వాటితో రైతులు నష్టపోయినప్పుడు బీమా అమలు చేయకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోయారని గుర్తుచేశారు. పంట నష్టం జరిగినపుడు రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవడానికి చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

మద్దూరు(హుస్నాబాద్): జనగామ జిల్లా రఘునాథపల్లిలో జరిగిన ఓపెన్ సర్కిల్ క్రికెట్ టోర్నీ ప్రథమ బహుమతి పొందిన క్రీడాకారులను ప్రముఖ దంతవైద్యుడు దయానంద్ పంచాయతీ ఆవరణలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్, మాజీ ఉపసర్పంచ్ రమేశ్, సీనియర్ క్రీడాకారులు ఎండి రజాక్, మల్లేశం, సాయిచరణ్, భువన్, సాయికిరణ్, విజయ్, వినయ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

'పల్లె ప్రకృతి' ధ్వంసం

అభివృద్ధిలో భాగంగా ప్రజాధనంతో నిర్మించిన పలు నిర్మాణాలను ధ్వంసంచేసి ప్రభుత్వ నిధులను మట్టిపాలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చినా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని పొట్లపల్లి, వంగరామయ్యపల్లిలో ప్రకృతి వనాలను ధ్వంసం చేశారు. అయినా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల నుంచి తీవ్రమైన అసంతృప్తి ఎదురవుతోంది.

- రూ.లక్షలతో నిర్మాణాలు
- క్షణాల్లో తొలగింపులు
- వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు కూడా నిరుపయోగమే..

హుస్నాబాద్‌రూరల్: పల్లెలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం 2018 నుంచి గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో ప్రభుత్వ భూములను సేకరించి లక్షల వ్యయంతో రకరకాల మొక్కలను కొనగోలుచేసి నాటించి ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. అవి సాయంకాలం వృద్ధులు సేద తీరడానికి ఉపయోగపడేవి. అలాగే విద్యార్థులకు పిక్‌నిక్ స్పాట్‌లుగా ఉండేవి. దీంతో పల్లెలకు ప్రత్యేకతను తీసుకువచ్చాయి.

లక్షల్లో నిర్వహణ ఖర్చులు

హుస్నాబాద్ మండలంలో 17 పంచాయతీల్లో ప్రభుత్వ భూములను గుర్తించిన అధికారులు పార్కులను ఏర్పాటు చేయించారు. ప్రకృతి వనాల ఏర్పాటుకు ఒక్కొక్క గ్రామానికి రూ.5లక్షల వరకు నిధులు ఖర్చు చేశారు. నిర్వహణ కోసం నెలకు రూ.5వేల చొప్పున యేడాదికి రూ.60 వేలు ఉపాధి హామీ నిధుల నుంచి చెల్లించారు. మూడేళ్లకు రూ.1.80 లక్షలు నిర్వహణ ఖర్చులు చెల్లించారు. ఒక్కొక్క ప్రకృతి వనానికి రూ.8లక్షల వరకు ఖర్చు చేశారు.



వంగరామయ్యపల్లిలో మొక్కలు లేని పల్లె ప్రకృతి వనం

క్షణాల్లో కనుమరుగు

నీళ్లుపోసి పెంచిన చెట్లను క్షణాల్లో కనుమరుగు చేయడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొట్లపల్లి ప్రకృతి వనంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారుల ఆదేశాల మేరకు పోలీసు స్టేషన్‌లో పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశారు. అలాగే వంగరామయ్యపల్లి ప్రకృతి వనం తొలగింపుపైనా స్థానిక అధికారులు ఇప్పటి వరకు జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వనే లేదు.

నిరుపయోగంలో వైకుంఠధామాలు



పొట్లపల్లిలో ధ్వంసమైన వనం

గత ప్రభుత్వం రూ.14లక్షల వ్యయంతో గ్రామానికో వైకుంఠధామాన్ని నిర్మించింది. నీటి కోసం బోరు, విద్యుత్ లాంటి సౌకర్యాలను కల్పించింది. పొట్లపల్లి వైకుంఠధామం నిర్మాణం పనులు నేటికీ అసంపూర్తిగానే మిగిలాయి. కొన్ని గ్రామాల్లో వైకుంఠధామాల పనులు పూర్తి చేసినా ఉపయోగంలోకి తేవడానికి అధికారులు విఫలమయ్యారు. అలాగే ప్రతి గ్రామంలో రూ.3లక్షల వ్యయంతో డంపింగ్ యార్డులను నిర్మించినా వాటిని సద్వినియోగం చేసుకోవడంలో స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చాం



ప్రకృతి వనాలను ధ్వంసం చేసిన విషయం పీడీ దృష్టికి తీసుకుపోయినం. పొట్లపల్లి సంఘటనపై పంచాయతీ కార్యదర్శి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలను నిత్యం పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు.

– వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ, హుస్నాబాద్

వైకుంఠధామాల పనులు పూర్తి చేసినం



హుస్నాబాద్ మండలంలో 17 గ్రామాలకు ఏడింటిని ఉపాధి హామీ పథకంలో భాగంగా పూర్తి చేసినం. పది గ్రామాల్లో పీఆర్ ఏఈలు పనులను చేయించి రికార్డు చేశారు. భూ సమస్య వల్ల పొట్లపల్లి వైకుంఠధామం అసంపూర్తిగా మిగిలింది. ఉపయోగంలోకి రాని వాటిని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– పద్మ, ఏపీఓ, హుస్నాబాద్

అమరుల త్యాగాలు మరువలేనివి

- ముమ్మరంగా సంస్మరణ దినోత్సవాలు
- ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకుల నివాళులు



హుస్నాబాద్: నాయకుల నివాళులు

గజ్వేల్‌రూరల్/హుస్నాబాద్/మిరుదొడ్డి(దుబ్బాక)/జగదేవ్‌పూర్(గజ్వేల్)/బెజ్జంకి(సిద్దిపేట)/నంగునూరు(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్/సిద్దిపేటరూరల్/మద్దూరు(హుస్నాబాద్): మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు కొనియాడారు. సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం గజ్వేల్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ వర్గీకరణ సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివన్నారు. మంత్రి వర్గ విస్తరణ చేపట్టి మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని, అమర వీరుల స్తూపాన్ని ఏర్పాటు చేయాలని అలాగే హైదరాబాద్ సమీపంలో 5ఎకరాల స్థలాన్ని కేటాయించి మ్యూజియం నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మహేశ్, రాజు, రమేశ్, రవి, ప్రభుదాస్, వినోద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే హుస్నాబాద్‌లో మాజీ కౌన్సిలర్ రవీందర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు వెంకట స్వామి, సుధాకర్, సంపత్, బీసీ సంఘం నాయకులు రాజు, అంబేడ్కర్ సంఘం నాయకులు వెంకట్, సంపత్, బాబు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొండల్ నివాళులర్పించారు అధికార ప్రతినిధి రాజశేఖర్, నాయకులు యాదగిరి, పరశురాములు, మల్లయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్‌లో జేఏసీ మండలాధ్యక్షుడు యాదగిరి, బాబు, గణేష్, బాలకృష్ణ, రామస్వామి, భాస్కర్, శివ, రమేష్ తదితరులు నివాళులర్పించారు. బెజ్జంకిలో మండల అధ్యక్షుడు పరశురాములు, ఇన్‌చార్జి పరశురాములు, లక్ష్మణ్, రాజు, భూమయ్య, రాజు, చంద్రయ్య, అఖిల పక్ష నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బాలనర్సు, రాజేశం తదితరులు పాల్గొన్నారు. నంగునూరులో ఎంఎస్పీ మండలశాఖ అధ్యక్షుడు దేవులపల్లి బాలరాజు, యాదయ్య, హరిబాబు, శంకర్, నర్సింగారావు, భిక్షపతి, కృష్ణ, బాలరాజు, కనకరాజు, దేవేందర్, రాజు, కిష్టయ్య పాల్గొన్నారు. నారాయణరావుపేటలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బింగి పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో అశోక్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దూల్మిట్టలో జరిగిన కార్యక్రమంలో భాస్కర్, రాజేష్, ఎమ్మార్పీస్ అధికార ప్రతినిధి నాగులపల్లి సంపత్, కనకస్వామి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

అన్నిశాఖలతోను సమన్వయం అవసరం

గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా నేత

చిన్నకోడూరు(సిద్దిపేట): అన్ని శాఖల ఉద్యోగులు సమన్వయంతో ముందుకు సాగాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్ను శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రంగనాయక సాగర్ గెస్టుహౌస్‌లో శనివారం సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా చెన్ను శ్రీనివాస్‌రావు, కార్యదర్శిగా జయశ్రీ, ఉపాధ్యక్షుడిగా అయోధ్యరెడ్డి, కార్యాలయ కార్యదర్శిగా సతీశ్‌ను నియమించారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ ఉద్యోగుల మెరుగైన పనితీరుకు ప్రభుత్వం తగిన గుర్తింపు నిస్తుందన్నారు. సమావేశంలో సెంట్రల్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ రావు, కార్యదర్శి సత్యనారాయణ, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రంరెడ్డి తదితరులు ఉన్నారు.



శ్రీనివాస్‌రావును అభినందిస్తున్న ఉద్యోగులు

ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధ్యం



పరేడ్‌ను పరిశీలిస్తున్న అదనపు డీసీపీ

అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలమని అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. పెద్దకోడూరులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని సివిల్, రిజర్వ్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి శనివారం మండల పరిధిలోని పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది క్రమం తప్పకుండా వాకింగ్, రన్నింగ్, యోగా వంటివి చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వ్యాయామం నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. చెడు వ్యసనాలకు బానిసై విధులలో నిర్లక్ష్యం వహిస్తే పోలీస్‌శాఖ ప్రతిష్టకు భంగం కలిగించేవారవుతారన్నారు. కార్యక్రమంలో ఏసీపీ మధు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



నంగునూరు(సిద్దిపేట): నర్మేట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఘనంగా స్వయం పరిపాలన

స్వయం పరిపాలన దినోత్సవాన్ని పలు పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై తోటివారికి పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించి బహుమతులు అందజేశారు.



వర్గల్(గజ్వేల్): చౌదరిపల్లి ఉన్నత పాఠశాలలో..



చిన్నకోడూరు(సిద్దిపేట): చంద్లాపూర్‌లో..

పాఠశాలకు బాట

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రెడ్యానాయక్‌తండా పరిధిలోని డీఎన్టీ(డీనోటీఫైడ్) గవర్నమెంట్ హైస్కూల్‌కు వెళ్లేందుకు తహసీల్దార్ మధుసూదన్ బాట వేయించేందుకు చొరవ చూపారు. పాఠశాల నిర్మాణం కోసం స్థానికులు అప్పట్లో భూమిని విరాళంగా అందజేశారు. అయితే పాఠశాల చుట్టూ ఇండ్ల నిర్మాణాలు కావడంతో పాఠశాలకు వెళ్లేందుకు బాట లేకుండా పోయింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బాట కోసం విద్యార్థులు పోరాటాలు చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్ మధుసూదన్ భూ యజమానులను ఒప్పించి శనివారం రెవెన్యూ అధికారుతో కలిసి పాఠశాలకు బాట కోసం హద్దులను ఏర్పాటు చేశారు. తహసీల్దార్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

పీస్ కమిటీ సమావేశం

గజ్వేల్‌రూరల్: రంజాన్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ సైదా, ట్రాఫిక్ సీఐ మురళి సూచించారు. శనివారం గజ్వేల్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యతో కలిసి వారు మాట్లాడారు. రంజాన్ మాసం ప్రారంభమవుతోందని, అందరూ శాంతియుతంగా వ్యవహరించాలని కోరారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ మారుతి తదితరులు పాల్గొన్నారు.

పూలే గురుకులంలో దశాబ్ది ఉత్సవాలు



ప్రారంభోత్సవంలో ప్రిన్సిపాల్ తదితరులు

వర్గల్(గజ్వేల్): వర్గల్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం దశాబ్ది ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మార్చి 31 నాటికి కళాశాల ఆవిర్భవించి పది సంవత్సరాలవుతున్న సందర్భంగా నెలరోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మద్దూరు(హుస్నాబాద్): చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొండూరి స్వప్న కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. దానికి తోడు పిల్లలు కలుగకపోవడంతో మానసిక వేదనకు గురై గత 23న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆసుత్రికి తరలించడా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్టు దూల్మిట్ట తహసీల్దార్ మధుసూదన్ తెలిపారు. నంగునూరు మండలం ఖాత గ్రామానికి చెందిన వ్యక్తులు మూడు ట్రాక్టర్ల ద్వారా వాగులో నుంచి ఇసుకను తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చామని చెప్పారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

- ఎస్ఐ అపూర్వరెడ్డి



సిద్దిపేటరూరల్: మాట్లాడుతున్న ఎస్ఐ అపూర్వరెడ్డి

సిద్దిపేటరూరల్: చాలా మంది సైబర్‌నేరాల బారిన పడి మోసపోతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అపూర్వరెడ్డి సూచించారు. మండల పరిధిలోని చింతమడక గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ నగదు వ్యవహారాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టామని, తల్లితండ్రులు పిల్లలను గమనించాలని చెప్పారు. కళాబృందం బాలు, రాజు, తిరుమల, సాంస్కృతిక బృందం రవి, రవీందర్, ఎల్లయ్య, తిరుమలయ్య, బాబాయి, క్రాంతి, రవీందర్ ప్రజలకు అవగాహన కల్పించారు.

మర్రిముచ్చాల పాఠశాలలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ రాజుగౌడ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు రక్షణగా ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అపరిచితుల మాటలు నమ్మవద్దన్నారు. ఏదైనా సమస్య ఉంటే తోటి విద్యార్థులకో, ఉపాధ్యాయులకో, లేదా షీటీమ్స్‌కో తెలపాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం అంజయ్య, ఉపాధ్యాయులు, షీటీమ్ బృందం తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ బ్యాంకుతో ప్లాస్టిక్ వినియోగానికి చెక్

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి



స్టీల్ బ్యాంక్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: శుభకార్యాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడానికి ప్రజలంతా స్టీల్ బ్యాంకును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. పట్టణంలో దుకాణాల సముదాయంలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్టీల్ బ్యాంకును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని పలు ఫంక్షన్ హాళ్లలో విరివిగా ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువులను రానున్న రోజుల్లో పూర్తిగా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ సహకారంతో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలతో కలిసి మరిన్ని స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం డబుల్‌బెడ్రూం కాలనీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మెప్మా సీఓ రేణుక, సిబ్బంది ప్రవీణ్, దిలీప్, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

త్వరలోనే పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం

పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి

తొగుట(దుబ్బాక): మండల కేంద్రంలో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్టు పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో వైస్ చైర్మన్ కుర్మ యాదగిరితో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. పొద్దుతిరుగుడు పంట చేతికొచ్చిందని, రైతులు తొందపడి దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌ను కలసి తొగుటలో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశామని, ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులను కోరారు. తమ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో 1988 బ్యాచ్ మిత్రులు

సిద్దిపేటకమాన్: పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల 1988 బ్యాచ్‌కు చెందిన వారంతా ఆనాటి ఘటనలను గుర్తుచేసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనానికి అమెరికా నుంచి వచ్చిన గోపి సిరినేని, దేవేందర్ రెడ్డి, రాజేందర్, జ్ఞానేశ్వర్ చదువుకునే రోజుల్లో సిద్దిపేటతో ఉన్న అనుబంధాన్ని తెలిపారు. సేవా కార్యక్రమాల్లో తమ వంతు సహ కారం అందిస్తామన్నారు. తమ మిత్రుడు వినోద్ మొదానీని అభినందించారు. కార్యక్రమంలో మిత్రబృందం వంశీధర్‌రావు, సురేందర్, పాండు, కనకయ్య, ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.